**దళిత కథ**

# బతుకుతున్న శవాలు

మరాఠీ మూలం: శంకర్రావ్ ఖరత్

తెలుగు: డా. దేవరాజు మహారాజు



ఊళ్ళో కామాటి పనిచేయడం ఎంత కష్టమో నాకు బాగా తెలుసు. కామాటి పనంటే అది మెహర్ల మెడకు దిగేసిన గుదిబండ. ఆ పని చేసి చేసి మా నాయన తన బతుకంతా బుగ్గి చేసుకున్నాడు. ఆయన జీవితంలోంచి ఒక చిన్న అనుభవం మీకిప్పుడు చెబుతాను. అదెంత దుర్భరమైందో, గుర్తొచ్చినప్పుడల్లా నాకు వెన్నులోంచి వణుకు పుడుతుంది.

గ్రామకట్టడి ప్రకారం అప్పటి వంతు మాదే! ఆ ఊళ్ళో మాకో చిన్న గుడిసె ఉంది. ఆ గుడిసె ఉన్నందుకు వంతు చేయక తప్పదు. వేసవి సెలవులు గడుపుతూ అప్పుడు నేను ఊళ్ళోనే ఉన్నాను.

ఊరి పక్కన పాడుబడిన బావిలో ఒక శవం తేలుతోంది. బాగా ఉబ్బి, నీటి మట్టానికి లేచింది. గ్రామపెద్దపాటిల్‌కు వార్త అందింది. వెంటనే ఆయన వంతు చేయాల్సిన మా నాయనకు కబురు పెట్టాడు. మా నాయన వెళ్ళి రాత్రంతా శవానికి కాపలా ఉన్నాడు. తెల్లవారింది. పొద్దెక్కింది. హెడ్ కానిస్టబుల్ ఆపాటికి అక్కడికి రావాల్సింది. కాని రాలేదు. శవ విచారణ జరిగే వరకూ కాపలా ఉండడం మెహర్ల విధి.

క్రితం రోజు సాయంత్రం వెళ్ళినవాడు, మరునాటి మధ్యాహ్నమైనా ఇంటికి రాలేదు. నాయన రాలేదని అమ్మ కంగారు పడింది. పోయినవాడు పోయినట్లే ఉన్నాడు. ఇక విధి లేక ... బక్రీ (రొట్టె) గుడ్డలో చుట్టి, నాయనకు ఇచ్చి రమ్మని అమ్మ నన్ను పంపింది. నేను బావి దగ్గరకు వెళ్ళాను. శవానికి కాపలా ఉన్న నాయనను చూశాను.

"నాయినా ఏంటే ఇదీ. రాత్రినించి ఇక్కణ్ణే ఉండి పోతివి. పొద్దున రాకపోతివి. మధ్యాహ్నమైనా రాకపోతివి. ఇక ఎంతకూ రాకపోయే సరికి అమ్మ బయపడతాందాయే..." అన్నాను.

నాయన బావివైపు చూసి, "అవున్రా, మరి హెడ్ కానిస్టేబుల్ రాలేదు. ఆయన వచ్చి ఇచారణ జరిపేవరకు మెహర్ ఇక్కణ్ణించి కదిలేది లేదు. పోయి అమ్మకు చెప్పు. నేనొచ్చే వరకు బాగా పొద్దుపోతుందని!" నాయన చుట్టతీసి పొగాకు నింపుకున్నాడు. ఆకలిని అణగద్రొక్కే ప్రయత్నం చేస్తున్నాడని నేను గ్రహించాను. "నాయినా రొట్టె తెచ్చాను. గబుక్కున తినరాదా?" అని అన్నాను.

"ఇదో ఈ పీనుగ సంగతి ఏదో తేలాలి. అంతా ఎటుదటు అయిపోతేగాని, నాకు ముద్ద దిగదు" అన్నాడు.

"అదెప్పుడయి పోవాలి? తిండీ తిప్పలు లేకుండా ఎంతసేపుండగలవ్- అసలే పెద్దప్రాణం'

"లేదురా. పోలీస్ కానిస్టబుల్ ఒచ్చాడు. పాటిల్ గారింట్లో భోంచేస్తున్నాడు. ఏముందీ? **ఆయినరాగానే పీనుగను బయటికి తీయిస్తాడు.** ఇచారణ జరిపిస్తాడు. అప్పటి దాక నేనిక్కణ్ణించి కదలకూడదు." అన్నాడు విధినిర్వహణలో ఏ మాత్రం వెలితి రానివ్వని మా నాయన.

అప్పుడు చెట్టుకింద అట్టహాసంగా కూర్చున్న పాటిల్‌ను చూస్తూ.... నేనన్నాను.

"అదిగో పాటిల్ తినే వచ్చాడు. కానిస్టబుల్ తినేవస్తాడు. మరినీకేమయిందే నాయనా ఇంత రొట్టెముక్క తినడానికీ?" ఒప్పించే ప్రయత్నం చేశాను, మళ్ళీ -

"ఆ వాళ్ళతో మనమెక్కడరా? వాళ్ళంటే


పెద్దోళ్ళు! దొరలు! అధికారులు!! తినకుండా వాళ్ళెట్లా పనిచేయిస్తారు చెప్పు" - అన్నాడు.
"యేం మనం మాత్రం ఎట్లా చేస్తాం? మనం మనుషులం కాదా?" అన్నానేను ఉక్రోషంగా-
"గ్రామ కట్టడి అంటే ఇంతేరా పిచ్చోడా! నీకేం తెలుసు? నువ్వు చిన్నోడివి - మెహర్ అన్నవాడు బతికాడా చచ్చాడా అన్నది ఎవరూ పట్టించుకోరు"- అన్నాడు. నాయనను ఒప్పించం చాలా కష్టమని గ్రహించాను. నేను శవాన్నికాపలా కాస్తాననీ, తనని వెళ్ళి రొట్టె తినమనీ - మరో ఉపాయం చెప్పాను. అంతే! ఒక్కసారిగా నాయన పెద్దగా అరిచాడు. నా సూచన ఆయనను అంతగా కలచివేస్తుందని నేను ఊహించలేదు. "వద్దు. వద్దు వెళ్ళిక్కణ్నించి ఈ గ్రామ కట్టడి నీకు తెలియదు. ఒక్కసారి వంతు చేశావా? అంతే - జీవితాంతం చేస్తూనే ఉండాలి. ఈ ఊబిలోకి నువ్వు దిగొద్దు. వెళ్ళు ఈ పద్ధతి, ఈ కట్టడి మమ్మల్ని పశువుల్లాగా కట్టేసింది. చాలు.. చాలు... ఇంక నువ్వు కూడానా ఇందులోకి? వెళ్ళు వెళ్ళు -- ఎప్పుడు వీలైతే అప్పుడు నేనొచ్చి తింటాలే నువ్వింటి కెళ్ళు." - నాయన గొంతులో కోపం, ఆక్రోశం, నిరాశా, నిస్సహాయతా కలగలసి ఉన్నాయి. నా భవిష్యత్తుపై ఆశలు పెట్టుకున్న నా తండ్రిని చూస్తే ఎందుకో నాకు ఆక్షణం భయమేసింది.

సరిగ్గా ఆ సమయంలోనే యూనిఫాంలో ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్ళు అక్కడికి కొచ్చారు. బరువైన బూట్లకింద ఉన్న మేకుల వల్ల కాబోలు, వాళ్ళు నడుస్తున్నప్పుడు నేలమీద టకటకమని చప్పుడవుతూ ఉంది. వాళ్ళు బావి వద్దకు చేరుకునే సరికి, వెనక గుర్రంపై స్వారీ చేస్తూ హెడ్‌కానిస్టేబుల్ వచ్చాడు. ఊరి పెద్ద పాటిల్ లేచి నమస్కారం చేశాడు. బావి చుట్టూ మూగిన జనమంతా పక్కకు జరిగి హెడ్‌కానిస్టేబుల్‌కు దారి విడిచారు. ఒక రమోషిన్ పరుగు పరుగున వెళ్ళి దండం పెట్టాడు. గుర్రాన్ని అందుకుని చింత చెట్టుకు కట్టేశాడు. నాయన కూడా మోకాళ్ళ దాకా వంగి దండం పెట్టాడు. గుర్రానికి కావల్సిన ఏర్పాటు ముందే చేసి ఉంచారు. కనక, మెహర్, రమోషిన్ (మాలమాదిగ)లు కలిసి గుర్రానికి పచ్చిగడ్డి వేశారు. ఆకలితో ఉన్న ఆ గుర్రం పరపరా నమలడం మొదలు పెట్టింది.

హెడ్ కానిస్టేబుల్ రాజఠీవితో చుట్టూ పరికించాడు. లాఠీని అటూ ఇటూ తిప్పుతూ బావిలోకి తొంగిచూశాడు. మళ్ళీ చుట్టుపక్కల చూశాడు. బావిలోకి దిగే మెట్లు ఎటువైపు ఉన్నాయో అటు వెళ్ళాడు. పై మెట్లు కొన్ని మట్టిలో కూరుకుపొయ్యాయి. కొన్ని కింది మెట్లు నీళ్ళలోకి జారిపొయ్యాయి. మధ్యలోవి కొన్ని ఊడి కింద పడేట్లు ఉన్నాయి. అది చాలా పెద్ద బావి. అయితే చాలా పాతది. బావి లోపలి గోడల వెంట దట్టంగా గడ్డి మొలచి ఉంది. బావి నీళ్ళు చాలా కాలంగా వాడుకలో లేనందువల్ల నీళ్ళమీద నాచు పెరిగి, పచ్చగా కనిపిస్తున్నాయి. బావి చుట్టూ ఉన్న చెట్ల కొమ్మలు, విరిగి, ఆకులు రాలి అక్కడక్కడా నీళ్ళలో తేలుతున్నాయి. బావి చాలా లోతైంది. అలాంటి దిక్కుమాలిన పాడుపడ్డ బావిలోంచి శవం ఎలా పైకి రావాలి? సమస్య జటిలమైందే. వాస్తవాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని హెడ్‌కానిస్టేబుల్ బాగా ఆలోచించాడు. ఊరి పెద్ద పాటిల్‌తో రహస్యంగా చర్చించాడు. ఊరి పెద్ద బుర్ర ఊపాడు. ఏవో సూచనలు చేశాడు. కొద్ది సేపటి తర్వాత హెడ్ కానిస్టేబుల్ మా నాయనను కేకేశాడు.

"ఎవడ్రా మెహార్? ఇంకా యేం చేస్తున్నట్టురా? బావిలోకి దూకి శవాన్ని బయటికి తీయక ? ... మేమిక్కడెంత సేపుండాలిరా?" -- అధికార దర్పం ప్రదర్శించాడు.

వాళ్ళిద్దరి మాటలు నేనేకాదు. అక్కడ గుమికూడిన వాళ్ళంతా వింటూనే ఉన్నారు. హెడ్ కానిస్టేబుల్ ఉన్న ఫళాన కాలెగరేశాడు. రోషంతో ఊగి పొయ్యాడు. కళ్ళెర చేసి మానాయనను బూతులు తిట్టాడు. "బావిలోకి దూకుతావా లేదురా? నన్నే ఎత్తి పడేయమంటావా? నీయవ్వ ... పొగరెక్కిందిరా మీకూ" - అంటూ మీదికి ఉరికాడు. పరిస్థితి గమనించి మా నాయన బేలగా ముఖం పెట్టాడు. ఊ -అనలేదు ఆ - అనలేదు. చడీచప్పుడు లేకుండా మౌనంగా నిలబడ్డాడు. పాటిల్ కూడా కోపగించు కున్నాడు. కాండ్రించి ఉమ్మేశాడు. మా నాయననే కాదు, మొత్తం వంశాన్నే బూతులు తిట్టాడు. ఏమి మాట్లాడినా ప్రమాదమే అని కాబోలు. నాయన పెదవి కదపలేదు. బెదిరింపులు, హెచ్చరికలు, తిట్లు కురుస్తున్న కొద్దీ నాయన వణుకుతూ నిలబడ్డాడు. తప్పితే, ఏమీ అనలేకపోయాడు.




"అయ్యా-- ఇక్కడే ఉన్నా. మెహర్లు శవాన్ని కాపలా కాసేవరకే, బయటికి తీయడం వాళ్ళ పనికాదు!" అన్నాడు మానాయన.

"ఎవడ్రా వాడూ? మామాటకే ఎదురు చెప్తున్నాడు? అయ్" అని హెడ్ కానిస్టేబుల్ మరింత మండి పడ్డాడు.

"దొరా. అట్లాకాదు దొరా మేం పీనుగను ముట్టుకోగూడదు దొరా. పీనుగు తాలూకు మనుసులొచ్చి మమ్మల్ని బూతులు తిడతారు దొరా. ఈ ఊళ్ళో మేం బతకజాలం, దొరా!"

"నేను కదరా చెప్తున్నది. మామాట కాదనే వాడెవడ్రా... ఈ ఊళ్ళో? చెప్పు. వాళ్ళ పని ఇప్పుడే పడతా!" - అని మళ్ళీ గాండ్రించాడు హెడ్ కానిస్టేబుల్.

"అయ్యా మీరు సర్కారోళ్ళు. పనికాగానే వెళ్ళి పోతారు. మేం పేదోళ్ళం. పొట్టచేతపట్టుకుని ఇక్కణ్ణే ఈవూళ్ళోనే బతకాలి. మేం ఇక్కడ బతగ్గలమా మారాజ"- అన్నాడు నాయన అతి దీనంగా.

హెడ్ కానిస్టేబుల్ అంటే ఆరోజుల్లో ... 'ఎంతో పెద్ద అధికారి'- అని అనుకునేవారు ఊరు ఊరంతా గజగజలాడేది. అతని ముందు ఒక మెహర్ ఎంతటివాడు? గడ్డిపరక!

అన్నీ వింటూ, చూస్తూ నిలబడ్డ నాకు భయమైంది. నా పసిమనసు తట్టుకోలేక పోయింది. వాళ్ళ అరుపులు, కేకలు, తిట్లు, శాపాలు, బెదిరింపులు వినలేకపోయాను. అయితే ఇదంతా ఎందుకు జరుగుతుంది? అన్న ఆలోచన వచ్చింది. ఇంతకూ ఇది ఎవరి బావి? ఇది ఎవరి శవం? వీళ్ళంతా ఏకమై మా నాయనను ఎందుకు తిడుతున్నారు? అన్న ఆలోచన మొదలయింది.

మా నాయన ఒక అన్యాయానికి గురైవాడన్నది గ్రహించాను. అప్పటికే కొద్దిగా చదువుకున్న నాకు, న్యాయం- అన్యాయం స్పష్టంగా అర్థమవతూ ఉంటే, ఈ పెద్దలకు ఎందుకు అర్థం కావడం లేదు? అని మథన పడిపోయాను. ఈగ్రామంలో మెహార్‌గా పుట్టడమే తప్పయ్యిందా? నా రక్తం సలసలకాగిపొయ్యింది. ఆవేశం ఆపుకోలేక

వాదనకు దిగాను. "ఎందుకు? మానాయన్నెందుకు తిడతారు? శవం ఎవరిదో వాళ్ళ వాళ్ళొస్తారు. బయటికి తీస్తారు! ప్రభుత్వం వారే తీయించదలుచుకుంటే, తీయించుకోనీయండి. మా నాయినను బెదిరిస్తారెందుకూ? మెహార్‌గా పుట్టినందుకా? కామాటివంతులో ఉన్నందుకా? నిన్నటి నుండి రాత్రీ పగలు మంచి నీళ్ళు కూడా ముట్టకుండా శవాన్ని కాపలా కాసినందుకా?"- ఊపిరి బిగబట్టి అరిచాను. మాటలకోసం నేను వెతుక్కోలేదు. వాటంతట అవే వచ్చాయి.

దెబ్బతిన్న పులిలా హెడ్ కానిస్టబుల్ నావైపు గాండ్రుమన్నాడు. "ఈపోరడు ఎవడ్రా? జానెడు లేడు. మాటలు మాత్రం జోరుగా ఉన్నాయి. పిర్రల మీద నాలుగు తగిలించండిరా"-అని మరో కానిస్టబుల్‌కు పురమాయించాడు. కానిస్టబుల్ నావైపు వచ్చేసరికి నేను మరో రెండడుగులు వెనక్కివేసి మా నాయన దగ్గరికి చేరాను. నాయన నన్ను దగ్గరికి తీసుకుని నన్నే కోప్పడ్డాడు. "అరేయ్ నోర్ముయ్‌రా. నీకివ్వన్నీ తెలియవు. వయసుకు మించిన మాటలు అన్నాడు. నాయనకు మరో మార్గంలేదన్నది నాకు బాగా అర్థమైంది. కాసేపు నా వీపు నిమిరి నాయన బావి దగ్గరకు వెళ్ళాడు. చొక్కా విప్పి ఓమూల పడేశాడు. దానిమీద రాయి బరువు పెట్టాడు. కూలిపోకుండా, కాస్త గట్టిగా ఉన్న మూల చూసి, అక్కడణ్ణించి తాడు బావిలోకి విసిరి, పైకొసరాయికి చుట్టి, గట్టిగా కట్టాడు. తాడు పట్టుకుని బావిలోకి దిగడం ప్రారంభించాడు. నాయన సగానికి దిగాడోలేదో, నా దృష్టి కన్నంలోంచి బయటపడ్డ పాము మీద పడింది.

"నాయినా పాము పామే!"- అని అరిచాను. నాయన కింద నీళ్ళలోకి చూశాడు. అవి పచ్చగా, అసహ్యంగా, భయంకరంగా ఉన్నాయి. కాసేపు అలాగే తాడుకు వేలాడుతూ ఆగిపొయ్యాడు. "పాము అదిగో శవం దగ్గరికే వెళ్ళింది"అని అరిచాను. "అదిగదిగో శవానికి కిందివైపు వెళ్ళింది' ' "అదిగో మళ్ళీ పైకొచ్చింది"- అంటూ వెంట వెంటనే అరుస్తూ ఉండడంతో దూరంగా ఉన్న జనమంతా బావివైపు పరిగెత్తుకొచ్చారు. చోద్యం చూస్తూ నిలబడ్డారు. నాయన తాడుకు వేలాడుతూ, పామును గమనిస్తున్నాడు. నా అరుపులకు బెదిరిపోయిందో ఏమోగాని, కాసేపటికి పాము కన్నంలోంచి పారిపోయింది.

పామును పరిశీలనగా చూసిన ఊరిపెద్ద 'ఓస్ ఇంతమాత్రం దానికేనా? ఈ పాము కరవదు. కరిచినా ఏమీకాదు." అని ప్రకటించాడు. నాకు వళ్ళు మండింది. "అయితే బావిలోకి నువ్వుదిగు. కరుస్తుందో లేదో తెలుస్తుంది."-అన్నాను తెగించి

ఈపోరడేమిట్రా పెద్దపెద్ద మాటలు మాట్లాడుతాడు." - అని హెడ్ కానిస్టబుల్ మళ్ళీ నావైపు గుడ్లురిమాడు. "అరే మాదిగోడ! దిగురా దిగూ కిందికీ, -ఇంకా ఎంతసేపూ? నాకు ఆలస్యమైపోతుంది. వెళ్ళిపోవాలి." అని గద్దించాడు. నా రక్తం సలసలమంది. హెడ్ కానిస్టబుల్‌ను తినేసేట్లుచూశాను. అంతకన్నా ఏమీ చేయలేక పొయ్యాను. 'దొంగ నాకొడుకు. వీడూ మనిషేనా? మనిషికి పుట్టినోడేనా వీడు'- అని అనుకున్నాను. బావిలో నాయనను చూస్తూ మళ్ళీ కేకేశాను. "నాయనా! నువ్వుకిందికి దిగొద్దు. పైకొచ్చేయ్. నేనైతే ఒక్క నిముషంలో దిగుతా ఏదవుతే అదవుతుంది. నువ్వులేకపోతే ఇంటికి దిక్కెవరూ" అన్నాను. ఆ మాట అంటుంటే ఎందుకో నాకు తెలియకుండానే దు:ఖం పొంగుకొచ్చింది.

నాయనకూ దు:ఖం ఆగలేదు. భయం తగ్గలేదు. పైకి నావైపు చూస్తూ, వణికే గొంతుతో అన్నాడు. "ఒరే నాయినా ఏదవుతే అదవుతుంది లేరా? వూరంతా తెలువనీ. మెహర్ రాముడు పాము కరిచి చచ్చాడని! పాడుపడ్డ బావిలోంచి పీనుగను తీస్తూ.... పీనుగై పొయ్యాడని ఆ గవర్నమెంటోళ్ళకు కూడా తెలునని! వాడితో కానిపని చేయించి చంపారని! ప్రపంచానికంతా తెలువనీ! ఈపుటక పుట్టడమే చావు కొచ్చిందనీ తెలువనీ!! అందరికీ తెలవనీ!! -"అంటూ బరబరా నీళ్ళలోకి జారాడు. బావిలో వేలాడుతున్న తాడుకొసతో శవం కాళ్ళూ, మెడా చుట్టి, గట్టిగా ముడివేశాడు.

"అఁ- పైకి లాక్కొండి"- అని బిగ్గరగా అరిచాడు నాయన, ఆ పాటికి మరో ముగ్గురు మెహర్లు అక్కడికి చేరారు. శవాన్ని పైకి లాగారు. బావిలో వుండిపోయిన నాయన పాము ఏవైపు నుండి వస్తుందోనని..... భయం భయంగా చుట్టూ గమనిస్తున్నాడు. చల్లని నీటిలో మునిగినందువల్ల చలి, శరీరంలోని బలహీనత, భయం కలిసి ఆయన పరిస్థితి క్షణాలు లెక్కిస్తున్నట్లుగా ఉంది. రాళ్ళు పట్టుకుని, ఓ పక్కకు నిలబడి, తాడు కిందికి ఎప్పుడొస్తుందా అని చూస్తున్నాడు. కన్నంలోంచి పాము మళ్ళీ బయటి కొచ్చింది. నాయన ప్రాణాలు అరచేత పెట్టుకుని అయోమయంలో పడ్డాడు. పాము కూలిన మెట్లవైపు జరజరా పారిపోయింది. హమ్మయ్య ప్రమాదం తప్పింది. నా కళ్ళనిండా నీళ్ళు నిండాయి. బావిలోపలికి చూస్తూనే ఉన్నాను. నాయన మసక మసకగా కనిపించాడు. కళ్ళు తుడుచుకుని చూశాను. నాయన సంతోషంగా నావైపు చూశాడు. ఊపిరి గట్టిగా పీల్చుకుని, అందిన తాడు పట్టుకుని పైకి వచ్చాడు. నన్ను దగ్గరికి తీసుకున్నాడు. ఇద్దరి మనసులు తేలిక పడ్డాయి. గండం గడిచిందన్న భావన ఇద్దరికీ వచ్చింది. అక్కడ వున్నా పెద్దలకు ఈభావనలు ఏవీలేవు- యాంత్రికంగా విచారణ జరుపుకుంటున్నారు.

శవం బాగా ఉబ్బి, కంపుకొడుతోంది. అందరూ ముక్కులు మూసుకుంటున్నారు ప్రాథమిక విచారణ కాగానే, మెహర్లంతా కలిసి శవాన్ని ఎడ్లబండిలో పెట్టారు. శవం పై వేప ఆకులు దట్టంగా చల్లారు. అక్కడికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో వున్న డాక్టరు దగ్గరికి-పోస్ట్ మార్టం కోసం తీసుకు పోతున్నారు. వంతు మీద వున్నందుకు మానాయన, మరో మెహర్, ఒక కానిస్టేబుల్ బండి వెంట వెళ్తున్నారు. మురికి నీటిలో మునిగి వచ్చిన నాయన బట్టలు తడిసి చెడు వాసన వేస్తున్నాయి. ఆయనకు అధ్యాసే లేదు. వున్నా చేసేదేం లేదని అనుకున్నాడో ఏమో తెలియదు. నాచేతిలో గుడ్డలో చుట్టి వున్న రొట్టె ముక్కలు తీసుకుని బొడ్లో దొపుకున్నాడు.

"ఎళ్ళరా ఇక, ఇంటికెళ్ళు.... పీనుగుతో పాటు దవాఖానకు పొయ్యానని మీ అమ్మతో చెప్పు. కంగారేం లేదులే ఎళ్ళు-" అన్నాడు. నేను మౌనంగా నిలబడ్డాను....

బండి గాడిలో పడి ముందుకు పోతోంది. వెనకనే మానాయన నడుస్తున్నాడు. బండి, బండితో పాటు మానాయన..... కనుమరుగయ్యే వరకు చూస్తూ నిలబడ్డాను. 'శవం బండిలోదా? బండి వెనక నడిచే మానాయనదా?'- నాకళ్ళ ముందు నా తండ్రి పరిస్థితే ఇలా వుంటే, ఆయన తండ్రి, ఆయన తండ్రి, ఆయన తండ్రి పరిస్థితి ఈ సమాజంలో ఇంకా ఎంత దుర్భరంగా వుండేదో???

'అయితే మెహర్లు, రొమోషీస్‌గా పుట్టడమే నేరమా? ఇదేం గ్రామ కట్టడి. నీచమైన పనులు, అనారోగ్యకరమైన పనులు, భయంకరమైన పనులన్నీ వీళ్ళే ఎందుకు చెయ్యాలి?'- అని నా చిన్న మెదడ్లో ఆనాడు ఎన్నో ఎన్నో ఆలోచనలు... గిర్రున తిరిగాయి.

నేను పెరిగి పెద్దవాడినై, న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నా కూడా ఇప్పటికీ, అప్పటి నా ఆలోచనలు నన్ను వదలవు. ఆ జీవితం ఇప్పటికీ నన్ను భయపెడుతూనే ఉంటుంది. ఈ దిక్కుమాలిన మెహార్ వతన్ కోసమేనా మావాళ్ళు హైకోర్టుదాకా వెళ్ళారు? ఏం బావుకుందామని? నా మనసు ఎప్పుడూ బాధతో మూలుగుతూ ఉంటుంది. (శంకర్రావు ఖరత్ ఆత్మకథ ఆధారంగా)